సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 22 । నవంబర్ । 2023



గురుకుల విద్యార్థి ఆత్మహత్య

పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న కమలేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అధికారులు విచారణ నిర్వహించారు. 8లో ▸



అర్హులకు నేరుగా లబ్ధి

మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 8లో ▸



శ్రీవారి సన్నిధిలో...

ద్వారకాతిరుమల: వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ నండూరి ఉమ మంగళవారం సందర్శించారు.

చివరిలో అలజడి

- ఉమ్మడి జిల్లాలో మొదలైన ఖరీఫ్ మాసూళ్లు
- వాతావరణంలో మార్పులతో పలుచోట్ల వర్షం
- ఉమ్మడి జిల్లాలో 4.17 లక్షల ఎకరాల్లో సార్వా సాగు
- 63 వేల ఎకరాల్లో పూర్తయిన వరికోతలు



ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

సాక్షి, భీమవరం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో వాతావరణ మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తొలకరి సాగు తుది దశకు చేరుకోవడంతో వరి కోతలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 15 శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. ప్రస్తుత దశలో వాతావరణ మార్పులతో ఆకాశం మేఘావృతమై జల్లులు పడుతుండటం రైతులను కలవరపరుస్తోంది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 4.17 లక్షల ఎకరాల ఆయకట్టుకు గాను ఏలూరు జిల్లాలో 1.98 లక్షల ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో రైతులు సార్వా పంటను సాగుచేశారు. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, తణుకు, ఆచంట, పెనుగొండ తదితర ప్రాంతాల్లో వరికోతలు మొదలవగా మిగిలిన ప్రాంతాల్లో పనులు ఇప్పుడిప్పుడే ముమ్మరమవుతున్నాయి. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం మంగళవారం నాటికి ఏలూరు జిల్లాలో 30,800 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 33 వేల ఎకరాల్లో కోతలు పూర్తిచేయగా అక్కడక్కడ పంట పనలపై ఉంది. డిసెంబరు రెండవ వారం నాటికి ఖరీఫ్ చివరి దశ పనులు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో 44 శాతం లోటు వర్షపాతం నమోదైనప్పటికీ సాగు నీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. వాతావరణం అనుకూలించి తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో పంట ఆశాజనకంగా పండింది. ఏలూరులో 5.2 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరిలో 5.68 లక్షల మెట్రిక్ టన్నులు వరకు దిగుబడి వస్తుందని అంచనా.

రైతులకు అండగా కొనుగోలు కేంద్రాలు

ఖరీఫ్ కోతలు మొదలు కావడంతో రైతులకు అండగా ప్రభుత్వం ఇప్పటికే ఏలూరు జిల్లాలో 281, పశ్చిమగోదావరి జిల్లాలో 314 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. 25 లక్షలకు పైగా గన్నీ బ్యాగులను కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచారు. ధాన్యం రవాణాలో అక్రమాలకు తావులేకుండా వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

వాతావరణం చూసి కోతలు కోయాలి



ప్రస్తుతం ప్రతికూల వాతావరణం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతానికి ఇబ్బంది లేకపోయినప్పటికి వర్షం కురిసే అవకాశం ఉన్నప్పుడు కోతలు నిలిపివేసి అనుకూలించాక పనులు చేపట్టాలి. ఎక్కడైనా ధాన్యం వర్షానికి తడిస్తే మొలకలు రాకుండా ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారి చేయాలి. – జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ, భీమవరం

ఆందోళన కలిగిస్తున్న వాతావరణం



వరికోతకు సిద్ధంగా ఉన్న పంట పొలం

ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ చిరుజల్లులు పడుతుండటంతో పాటు చలిగాలులు వీస్తున్నాయి. మంగళవారం జిల్లాలోని తణుకు, అత్తిలి, పాలకొల్లు, ఇరగవరం, ఆచంట, పెనుగొండ, ఉండి, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలి ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. ప్రస్తుతం వరి కోతల కోసం కొందరు రైతులు కూలీలను వినియోగిస్తుండగా అధికశాతం మంది వరికోత యంత్రాలకు మొగ్గుచూపుతున్నారు. తేమ శాతం తగ్గించేందుకు ధాన్యాన్ని రోడ్లుపై, ఖాళీ స్థలాల్లో ఆరబెడుతున్నారు. ప్రతికూల వాతావరణంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో నెలకొంది. కొందరు జల్లులను లెక్కచేయకుండా కోతలు కోస్తుండా, వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుందన్న ఆందోళన మరికొందరు కోతలు విరమించుకుంటున్నారని రైతులు అంటున్నారు. ఇప్పటికే కోతలు కోసిన వారు కళ్లాల్లోని ధాన్యం ఆరబెట్టుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. కొందరు ధాన్యం ఆరబెట్టి చినుకులు పడితే వెంటనే దగ్గరకు పోగుచేసేందుకు వీలుగా అక్కడే కాపాలా ఉంటున్నారు. ప్రస్తుత వర్షం వలన పంటకు పెద్దగా ప్రభావం లేకున్నా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడితే పంటకు నష్టం కలుగుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. కొద్దిరోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే తొలకరి పంటను గట్టెక్కించుకుంటామంటున్నారు.

జిల్లా అభివృద్ధికి పటిష్ట చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలోని సహకార సంఘాల అభివృద్ధికి సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన పశ్చిమగోదావరి జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డీసీడీసీ) రెండో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లాలో సహకార నిర్వహణను పటిష్టం చేయడానికి ప్రణాళిక అమలును పరిశీలించేందుకు చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పీఏసీఎస్‌లు అభివృద్ధి చెందడానికి అవసరమైన వ్యాపార మార్గాలను గుర్తించామన్నారు. అన్ని కంప్యూటరైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రధానమంత్రి జన ఔషదీ కేంద్రాల స్థాపనకు చర్యలు తీసుకున్నామని, వాటిలో మొయ్యేరు, వెంప, ఇరగవరం, ఆకివీడు, ఎండగండి పీఏసీఎస్‌లు స్టోర్ కోడ్స్ కోసం దరఖాస్తు చేసుకున్నాయన్నారు. ఫేజ్-2 గొడౌన్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా కోఆపరేటివ్ అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీసీసీబీ ఏజీఎం శంకర్ నారాయణ, నాబార్డ్ డీడీ అనిల్ కాంత్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్, మత్స్యశాఖ అధికారి కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

టీడీఎస్ చెల్లింపుల్లో అశ్రద్ధ వద్దు



మాట్లాడుతున్న ఐటీ అధికారి శ్రీనివాసరావు

పాలకొల్లు సెంట్రల్: టీడీఎస్ చెల్లించే వ్యక్తులు క్రమం తప్పకుండా ప్రతీ నెలా చెల్లించాలని ఏలూరు ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో చాంబర్స్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహారావు అధ్యక్షతన ఇన్‌కంటాక్స్ టీడీఎస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మనం ఎవరికైనా నగదు చెల్లించే ముందు టీడీఎస్ కట్ చేసుకుని నగదు చెల్లిస్తామన్నారు. ఇలా కట్ చేసిన నగదు ప్రతి నెలా 7 లోపు టీడీఎస్ చెల్లించాలన్నారు. మూడు నెలలకు ఒకసారి ఎవరి నుంచి మనం టీడీఎస్ కట్ చేసుకున్నామో తెలిపేలా వారి వివరాలతో రిటర్న్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ ఆర్‌ఎస్‌ఆర్ మూర్తి, చాంబర్స్ సెక్రటరీ దేవరపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 24 నుంచి డిసెంబర్ 8 సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించే ఈ పరీక్షలకు ప్రశ్నాపత్రాలను రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో తయారు చేశారన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల ప్రశ్నాపత్రాలు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు ఏ రోజుకారోజు ఉదయం 8 గంటల నుండి 9 గంటల మధ్యలో సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి తీసుకోవాలన్నారు.

10వ తరగతి పరీక్షకు ఫీజు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు, గతంలో అనుత్తీర్ణత పొంది ప్రస్తుతం ప్రైవేటుగా హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా రుసుం చెల్లించడానికి గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించవచ్చని రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 1 వరకు రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 5 వరకు రూ. 500 అపరాధ రుసుముతో డిసెంబర్ 10 వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. ఈ తేదీల్లో ప్రభుత్వ సెలవు ఉంటే తరువాత రోజుల్లో వచ్చే పని దినాల్లో పరీక్షా రుసుం చెల్లించవచ్చని చెప్పారు.

మద్దతు ధర కల్పించడమే లక్ష్యం



కామవరపుకోట ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ కోటగిరి శ్రీధర్

కామవరపుకోట: పంటకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక విశాల సహకార సంఘంలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో వ్యవసాయం దండగని టీడీపీ పాలకులు హేళన చేసి రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేశారని, పండించిన పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో, రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునేవారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతు సంక్షేమమే లక్ష్యంగా, రైతు భరోసా, జలకళ, వంటి పథకాలే కాకుండా, దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. పంటకు మద్దతు ధర కల్పించడంతోపాటు, వారికి రావలసిన సొమ్మును, 21 రోజుల్లో జమ చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్‌బాబు, సొసైటీ చైర్మన్ సాయన కనకరాజు, సెక్రటరీ బాబురావు, రాష్ట్ర ముదిరాజ్ సంఘం డైరెక్టర్ చిక్కుళ్ళ శ్రీను, మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్, సర్పంచులు కరిపోతు అనూష, దేవరపల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి స్థలం మంజూరుకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి ఇంటి స్థలం మంజూరయ్యేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి జగనన్న కాలనీలకు అవసరమైన భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అర్హత కలిగి స్థలం మంజూరు కానీ వారు ఒక్కరు కూడా ఉండకూడదని స్పష్టం చేశారు. 90 రోజుల స్కీం కింద అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి, అవసరమైన భూ సేకరణ ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆర్డీఓలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. సిద్ధాంతం, పెనుగొండ, తణుకు ప్రాంతాలలో భూసేకరణపై ఆరా తీశారు. పెద్దలంక లేఅవుట్‌కు ప్రత్యామ్నాయ స్థలాన్ని చూడాలని తెలిపారు. ఇప్పటికే కేటాయించిన లేఅవుట్‌లకు వెళ్లడానికి అంగీకరించనివారి వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.కృష్ణవేణి, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, కె.చెన్నయ్య, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పేలుడు బాధితులకు అండగా ఉంటాం



పాలకొల్లు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: ఆచంట మండలం వల్లూరుతోట గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు, బాధితులకు అండగా నిలుస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంలో ఇద్దరు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మంగళవారం పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు క్షతగాత్రులను పరామర్శించారు. మృతి చెందిన దివి వెంకట్రావు, ఆదిలక్ష్మిల గ్రామం వల్లూరుతోట వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గ్యాస్‌సిలిండర్ పేలుడుకు కారణాలు ఏమిటో నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. ఆచంట నియోజకవర్గంలోని గ్రామాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినపుడు ఫైర్ ఇంజిన్లు రావడానికి ఆలస్యమవుతున్నందున ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణానికి ఇప్పటికే స్థలం కేటాయించామని, త్వరలోనే పనులు కూడా ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఆచంట ఏఎంసీ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య ఉన్నారు.

వృద్ధ దంపతులు మృతి

పోడూరు: ఆచంట మండలం వల్లూరుతోటలో సోమవారం రాత్రి గ్యాస్ సిలెండర్ పేలిన ప్రమాదంలో క్షతగాత్రులైన వృద్ధదంపతులు దివి వెంకట్రావు(70), ఆదిలక్ష్మి(60) మంగళవారం మృతి చెందారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం వెంకట్రావు మృతి చెందగా, సాయంత్రం ఆదిలక్ష్మి మృతి చెందింది. వారిద్దరి మృతితో వల్లూరితోటలో విషాదఛాయలు అలముకున్నాయి.

ముగిసిన జాతీయస్థాయి టెన్నిస్ టోర్నమెంట్



బహుమతులు అందుకున్న విజేతలు

నరసాపురం: నరసాపురం ఆఫీసర్స్ క్లబ్ వేదికగా 5 రోజుల పాటు నిర్వహించిన కొవ్వలి ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. 70 ఏళ్ల విభాగం సింగిల్స్‌లో రాధాకృష్ణమూర్తి, డబుల్స్‌లో డాక్టర్ చంద్రశేఖర్, ఎం.సాయిరాంబాబు, 65 ఏళ్ల విభాగం సింగిల్స్‌లో శేషు, డబుల్స్‌లో చంద్ర, తులసీరామ్ గెలుపొందారు. విజేతలకు రూ.5లక్షల ప్రైజ్‌మనీ అందించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ స్పాన్సర్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ గతంలో నరసాపురం వేదికగా జాతీయస్థాయిలో టెన్నిస్ టోర్నమెంట్లు జరిగేవన్నారు. మళ్లీ జాతీయ స్థాయిలో నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. సీనియర్ టెన్నిస్ ప్లేయర్, వైఎస్సార్‌సీపీ నేత సీహెచ్ చినరెడ్డప్ప ధవేజీ మాట్లాడుతూ నరసాపురం టెన్నిస్ టోర్నమెంట్లకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి కానూరి బుజ్జి, కటకంశెట్టి నారాయణరావు, కేఎస్ఆర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ సంకల్పయాత్ర విజయవంతానికి కృషి

ఏలూరు(మెట్రో): జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతానికి అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉమా నండూరి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం యాత్ర నిర్వహణకు సంబంధించి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులైనప్పటికీ ఇప్పటివరకు సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందని లబ్ధిదారులను గుర్తించి వారికి లబ్ధిచేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సంకల్ప యాత్ర నిర్వహణకు సర్వ సన్నద్ధంగా ఉన్నామని ఇందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పటిష్ట కార్యచరణ రూపొందించామన్నారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమం పటిష్టంగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించామన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం.. నిత్యాన్నదానం

- భీమవరం పంచారామ క్షేత్రం వద్ద కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ
- సోమవారాల్లో 20 వేల వరకు, సాధారణ రోజుల్లో ఐదు వేల వరకు భక్తుల తాకిడి
- అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో 21 ఏళ్లుగా అన్నదానం
- 100 క్వింటాళ్ల బియ్యం ఇచ్చిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



అన్నదానంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం



భోజనం చేస్తున్న భక్త జనసందోహం

భీమవరం(ప్రకాశం చౌక్): కార్తీక మాసంలో భీమవరం పంచారామక్షేత్రానికి వచ్చే భక్తులకు నెల రోజుల పాటూ నిత్యం అన్నప్రసాదం అందించడం విశేషం. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఉదయం 10 నుంచి సాయంత్రం గంటల వరకు అన్నదానం చేస్తున్నారు. కార్తీకమాసంలో సోమవారాల్లో 15 వేల నుంచి 20 వేల మంది, సాధారణ రోజుల్లో మూడు వేలు నుంచి ఐదు వేలు వరకు భక్తులు వస్తున్నారు. దాతలు, భక్తులు సహకరంతో శ్రీ ఉమాసోమేశ్వర కార్తీక అన్నసమారధన కమిటీ గత 21 ఏళ్లగా పంచారామక్షేత్రం వద్ద కార్తీక మాసంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోంది.

యాత్రీకుల హర్షం : పంచారామాల యాత్రీకులు మొదటిగా అమరావతి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మధ్యాహ్నానికి భీమవరం చేరుకుంటారు. ఇక్కడ స్వామి వారిని దర్శించుకున్న యాత్రీకులకు దేవస్థానం వద్దే అన్నదాన కమిటీ భోజన సౌకర్యం కల్పిస్తోంది. దీంతో భక్తులు మిగిలిన పంచారామాలను నిర్ణీత సమయానికి చేరుకుని సకాలంలో శివయ్యను దర్శించుకుంటున్నారు. రాష్ట్రం, జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతోపాటు, భీమవరం చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే భక్తులకూ అన్నప్రసాదం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో యాత్రీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కమిటీకీ, దాతలకు అభినందనలు తెలుపుతున్నారు.

భోజనం మెనూ : అన్నప్రసాదంలో పూర్తి నాణ్యత పాటిస్తారు. స్వీట్, పులిహోర, పప్పు, పచ్చడి, రెండు కూరలు, కార్తీక మాసం ప్రత్యేకంగా కంద బచ్చలి, అన్నం, సాంబారు, పెరుగు తదతర వాటితో భక్తులకు భోజనం వడ్డిస్తారు.

అన్నదానం ప్రారంభం : కార్తీక మాసం ప్రారంభమైన ఈనెల 14వ తేదీ నుంచి పంచారామ క్షేత్రం వద్ద అన్నదాన కమిటీ అన్నప్రసాద వితరణ చేస్తోంది. సోమవారాల్లో సుమారు 20 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. నిత్యం మూడు నుంచి ఐదు వేల మంది భోజనం చేస్తున్నారు.

100 క్వింటాళ్ల బియ్యం వితరణ

కార్తీకమాసంలో నిత్యాన్నదానానికి భీమవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ 100 క్వింటాళ్ల నాణ్యమైన బియ్యాన్ని ఇటీవల అందజేశారు. అన్నదాన కమిటీకి పలు సలహాలు ఇచ్చారు. అన్నప్రసాద వితరణలో పూర్తిసహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


అభినందనీయం



పంచారామ క్షేత్రం దర్శనానికి వచ్చే భక్తులకు భోజనానికి ఇబ్బందులు లేకుండా ఆలయం వద్దే అన్నదాన కమిటీ భోజన సౌకర్యం కల్పించడం బాగుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామి దర్శనం చేసుకున్న తర్వాత బయటకెళ్లి ఇబ్బందులు పడకుండా నాణ్యమైన అన్నప్రసాదరం అందజేయడం అభినందనీయం.

– కె.శ్రీనివాస్ శ్రీకాకుళం

యాత్రికులకు సౌకర్యవంతం



ఉమసోమేశ్వ కార్తీకమాస అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు గత 21 ఏళ్లగా కార్తీక మాసంలో అన్నదానం చేస్తున్నారు. ఇది యాత్రీకులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. కార్తీకమాసం మొదటి సోమవారం దాదాపు 11 వేల మంది భక్తులు ఇక్కడ అన్నప్రసాదం స్వీకరించారు. అన్నదాన కమిటీకి దేవస్థానం తరపున పూర్తిసహకారం అందిస్తున్నాం.

– డి.రామకృష్ణంరాజు, ఈఓ, పంచారామక్షేత్రం


ఆకలి తీరుస్తున్నారు



స్వామివారిని దర్శించుకున్న తర్వాత వృద్ధులు, పిల్లలు, ఇతర భక్తుల ఆకలిని అన్నదాన కమిటీ తీర్చడం హర్షణీయం. దేవస్థానం వద్దే భోజనం ఏర్పాటు చేయడంతో భీమవరం పట్టణంలో హోటల్స్‌కు వెళ్లి భోజనం కోసం ఇబ్బందులు పడే బాధ ఉండదు. భక్తుల సమయం వృధాకాకుండా మిగిలిన పంచారామాలకు వెళ్లుతున్నారు.

– కె.రత్నమ్మ విజయవాడ

గొప్ప సేవా కార్యక్రమం



పంచారామ క్షేత్రం వద్ద అన్నదాన కమిటీ అందిస్తోన్న భోజనం చాలా నాణ్యతతో ఉంది. కార్తీక మాసంలో భక్తులు తీసుకునే ప్రత్యేక వంటకాలు కూడా భోజనంలో ఉండడం విశేషం. మాలధారణ చేసిన భక్తులు కూడా ఇక్కడ సమాయానికి భోజనం చేసేలా సౌకర్యం కల్పించారు. అన్నదాన కమిటీ గొప్ప సేవా కార్యక్రమం చేపట్టింది.

– కె.కామేశ్వరరావు, పిఠాపురం

అర్హులకు నేరుగా లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

కలెక్టర్ ప్రశాంతి



భీమవరంలో లబ్ధిదారులకు వాహనాలు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, తదితరులు

భీమవరం: సంక్షేమ పథకాలు లబ్ధి నేరుగా అర్హులకు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ మత్స్యదినోత్సవం సందర్భంగా మంగళవారం భీమవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అర్హులకు ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తోందని, మత్స్యకారుల పిల్లల అభివృద్ధికి దోహదం చేసే విధంగా పీఎంలంక గ్రామంలో స్కిల్‌హబ్, తీరప్రాంతమైన నరసాపురంలో ఆక్వా యూనివర్శిటీ ఏర్పాటుచేశారని ప్రశాంతి వివరించారు. జిల్లా తీరప్రాంతంలో సుమారు మూడు వేలు మత్స్యకార కుటుంబాలున్నాయని, మత్స్యకారులు ఆరోగ్యం, చదువుపై దృష్టిపెడితేనే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం పీఎంఎస్‌వై పథకంలో మత్స్యకారులకు కేటాయించిన రూ.7 కోట్ల నిధులు సాంకేతిక లోపంతో వినియోగం నిలిచిపోయిందన్నారు. బియ్యపుతిప్పలో హార్బర్ ఏర్పాటుచేస్తున్నట్టు వెల్లడించారు. మత్స్యకార సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు అండ్రాజు చల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 974 కిలో మీటర్ల తీర ప్రాంతంలోని మత్స్యకారుల విద్య, రాజకీయ, ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలే కారణమని చెప్పారు. మత్స్యకార భరోసా పథకం ద్వారా ఏటా రూ.10 వేలు సాయం అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. గత ప్రభుత్వం మత్స్యకార భరోసా కేవలం 170 మందికి అందించగా నేటి ప్రభుత్వం 1,500 కుటుంబాలకు ఆర్థిక సాయం అందిందని వివరించారు. బోట్స్‌కు ఆయిల్ సబ్సిడీ అందిస్తున్నట్టు చెప్పారు. వేట విరామ సమయంలో ప్రభుత్వం ఇచ్చే సాయం అందించాలని కోరారు. మహిళా మత్స్యకార సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మత్స్యకారులు సబ్సిడీపై అందించిన వాహనాలను కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, మొగల్తూరు జెడ్పీటీసీ తిరుమాని బాబ్జి, ఆక్వా రైతుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదిరాజు వెంకట సుబ్బరాజు (కేజీఎఫ్), మత్స్యకార సహకార సంఘం జిల్లా డైరెక్టర్ తిరుమాని సీతామహాలక్ష్మి, ఎల్ఎల్ఎన్ రాజు, డీఎస్ భానుమూర్తి, కె.శ్రీనివాసరావు, కొపనాతి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అందరి బాగుకోసం ప్రార్థించాలి

శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు



బలిపీఠాన్ని ప్రారంభిస్తున్న హోం శాఖ మంత్రి వనిత, చిత్రంలో శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

ఆకివీడు: ప్రజలందరి బాగుకోసం ప్రార్థించాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పిలుపునిచ్చారు. ఆకివీడు మండలం చినమిల్లిపాడు గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన సీబీసీఎన్‌సీ బాప్టిస్ట్ చర్చిని మోషేన్‌రాజు, బలిపీఠాన్ని మరో ముఖ్యఅతిథి హోంశాఖ మంత్రి తానేటి వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మోషేన్‌రాజు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి పూనుకున్న, సహకరించిన ప్రతి ఒక్కరికీ భగవంతుడి ఆశీస్సులు ఉంటాయన్నారు. హోం మంత్రి వనిత మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జగనన్నను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ క్రైస్తవ మందిర నిర్మాణానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు), క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, ఎమ్మెల్యే మంతెన రామరాజు, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, మండల బూత్ కన్వీనర్ అంబటి రమేష్, సర్పంచ్ గురుదాసు సీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలిక ఆత్మహత్య

యలమంచిలి: మలికిపురానికి చెందిన బాలిక మంగళవారం తన అమ్మమ్మ ఇంటి వద్ద కాజతూర్పు గ్రామంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై జాజుల విజయ నాగ ప్రసాద్ తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో బాలికను అమ్మమ్మ ఇంటికి పంపగా ఇక్కడ ఆమె ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

24న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

భీమవరం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈనెల 24న ఏలూరులో విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు పి.రాకడమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఏలూరు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న క్రీడామైదానంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. శరీరక వైకల్యం ఉన్నవారికి మూడు చక్రాల రిక్షా రేస్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, దృష్టి లోపం ఉన్న వారికి పరుగు పందెం, షాట్‌పుట్, క్యారమ్స్, మానసిక వైకల్యం ఉన్న వారికి పరుగు పందెం, సాఫ్ట్‌బాల్, డిస్కస్‌త్రో వంటి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 24న ఉదయం 8 గంటలకు క్రీడామైదానంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

బైక్ చోరీ కేసులో ముద్దాయిలకు జైలు

కాళ్ల: బైక్ దొంగతనం కేసులో ముద్దాయిలకు కోర్టు 8 నెలల జైలు శిక్ష విధించిందని ఎస్సై వీరభద్రరావు మంగళవారం తెలిపారు. గతేడాది అక్టోబర్ 9న కాళ్లకూరులో మోటార్ సైకిల్ చోరీకి గురైంది. దీనిపై బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు 2023 ఫిబ్రవరి 3న ఎస్సై మల్లికార్జున రెడ్డి కేసు నమోదుచేసి ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారని చెప్పారు. ఈ కేసులో ముద్దాయిలైన దేవర నాగేశ్వరరావు, బొక్కా వరసత్య లక్ష్మీనారాయణలకు మంగళవారం భీమవరం ఫస్ట్ ఏజేఎఫ్‌సీఎం కోర్ట్ మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

గురుకుల విద్యార్థి ఆత్మహత్య



దోసె కమలేశ్ (ఫైల్)



గురుకులంలో విచారణ చేస్తున్న అధికారులు

పెదవేగి : గురుకుల విద్యాలయం విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో భీమడోలు మండల శివారు అజ్జావారిగూడెంకు చెందిన దోసె కమలేశ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. అతని తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు (తంబి), రూతు మనస్పర్థలతో ఏడేళ్ల కితం పెద్దల సమక్షంలో విడిపోయారు. తల్లి రూతు చిన్న కుమారుడిని తీసుకొని చింతలపూడిలో నివాసం ఉంటోంది. తండ్రి వద్ద ఉన్న పెద్ద కుమారుడు కమలేశ్ గురుకుల విద్యాలయంలో సోమవారం రాత్రి వసతి గృహం పక్కనే అవరణలో ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నాడు. సిబ్బందికి సమాచారం అందించడంతో అర్ధరాత్రి కమలేశ్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే కమలేశ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెదవేగి తహసీల్దార్ నాగరాజు సమక్షంలో ఎస్సై ఎం లక్ష్మణ్ శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రభుత్వాసుపత్రిలో ఉన్న కమలేశ్ మృతదేహాన్ని దళిత సంఘాల నాయకులు సందర్శించారు. గురుకుల విద్యాలయంలో పరిస్థితులను పరిశీలించారు. కమలేశ్ మృతదేహాన్ని పరిశీలించిన ఆర్డీఓ ఎస్ఎస్కే ఖాజావలి, జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ సుందర్, గురుకుల విద్యాలయాల కన్వీనర్ నోముల సంజీవరావు విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఉత్తీర్ణత సాధించలేనని కమలేశ్ ఆందోళనకు గురైనట్టు తోటి విద్యార్థులు చెప్పారని ఆర్డీఓ తెలిపారు. కమలేశ్ మృతిపై అన్ని కోణాల్లోనూ విచారణ చేస్తున్నామని, కమలేశ్ కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



వివరాలు నమోదు చేస్తున్న వైద్యురాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బేబీ సెంటర్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ కేవీఎస్ రవికుమార్ ఆధ్వర్యాన వైద్యులు స్నేహిత, సుహాసిని, ఆశా లత, అమృత, శ్రావ్య రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శ్రీనివాసమూర్తి, ప్రసాద్, రామకృష్ణ, మోహన్‌రావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెంటపాడు: ధాన్యం కొనుగోళ్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాథుర్ సూచించారు. మంగళవారం ఆయన దర్శిపర్రులోని ధ్యానం, రైతు భరోసా కేంద్రాలను, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం పెంటపాడులోని పలు రైసుమిల్లులను పరిశీలించారు. సర్వర్ పనితీరు, తేమ శాతం, కొనుగోళ్లు, అమ్మకం తదితర విషయాలను తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో రైతులతో మాట్లాడారు. వాతావరణం మార్పు దృష్ట్యా ధాన్యం సేకరణపై ఆరా తీశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కె.పార్థసారథి, ఆర్‌ఐ కనకదుర్గ, వీఏఏ విజయ ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

తణుకు టౌన్: విద్యార్థులు ఇంటి పరిశరాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తణుకు అగ్నిమాపకదళ అధికారులు ఐ.హేమంతకుమార్, చిట్టిబాబు చెప్పారు. మంగళవారం తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె రామకృష్ణ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, జి.అరుణ కుమారి, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

సాహిత్యంపై అవగాహన అవసరం

పెంటపాడు: చదువుతో పాటు సాహిత్యం, యాత్రలు, దేశ ఆర్థిక, సామాజిక, వాస్తవిక స్థితిగతులపై విద్యార్థులు తప్పక అధ్యయనం చేయాలని ఢిల్లీకి చెందిన ప్రముఖ రచయిత దాసరి అమరేంద్ర అన్నారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు యాత్రా సాహిత్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రయాణాలు, సామాజిక యాత్రా అంశాలపై అమరేంద్ర అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు ఉపన్యాసకులు, రచయిత సంకర గోపాల్, డాక్టర్ ఎస్.శ్రీనివాస్, ఎం.ఇందిర, ఎన్‌సీసీ ప్రేమ్‌సాగర్, జాన్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై సమీక్ష

పెంటపాడు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సర్పంచ్‌ల సమన్వయంతో కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ సూచించారు. మంగళవారం ఆయన మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. డ్రైయినేజీ, చెత్త డబ్బాల ఏర్పాటు, పలు గ్రామాల్లో సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ ప్రసాద్, కార్యదర్శులు రామకృష్ణ, బేగ్, రామారావు, శ్రీరంగ, సచివాలయ అడ్మిన్‌లు పాల్గొన్నారు.

సర్వే పటిష్టంగా నిర్వహించాలి

తాడేపల్లిగూడెం అర్బన్: కుల గణన సర్వే పటిష్టంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు ఆదేశించారు. స్థానిక బలుసులమ్మ కళ్యాణ మండపంలో వార్డు సచివాలయ అడ్మిన్లు, సెక్రటరీలు, బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణన సర్వేలో ప్రజల నుంచి 14 అంశాలపై వివరాలు సేకరించిన నమోదు చేయాల్సి ఉందన్నారు. సర్వే విధులు నిర్వర్తించే ఉద్యోగులదే పూర్తి బాధ్యత అన్నారు. వివరాలు నమోదు చేసే క్రమంలో తప్పులకు తావు లేకుండా శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో రవీంద్ర, కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, మేనేజర్ దివ్యవాణి, సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

తాడేపల్లిగూడెం: అర్హత ఉన్న ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు కావాలని తాడేపల్లిగూడెం ఆర్డీఓ కె.చెన్నయ్య పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా మంగళవారం సిస్టమాటిక్ ఎలక్టోరల్ ఎన్యూమరేషన్ ప్రోగ్రామ్‌ను వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. 2024 జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్క విద్యార్థి ఓటరుగా నమోదు కావాలన్నారు.

ప్రజా సంక్షేమ పాలనకు జగన్ అవసరం

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కొనసాగడానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవసరమని 33వ వార్డు ఇన్‌చార్జి తాళ్ళూరి మురళీకృష్ణ అన్నారు. వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల నమ్మకాన్ని పొందారన్నారు. ప్రజలకు అసవరమైన సౌకర్యాలు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకుల మాటలు నీటి మీద రాతలు కాదని నిరూపించి నాయకులపై నమ్మకం కలిగించారన్నారు. జగన్ కావాలని ప్రజలు ఏకకంఠం చెబుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలిపించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివ్యకుమారి, ట్రెజరర్ జయరాం, నాయకులు గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, పట్నాల గణపతి, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, పత్సమట్ల సావిత్రి, బొద్దాని శ్రీనివాస్, మారిశెట్టి రమణ, తాళ్ళ ప్రసాద్, వట్టి బుజ్జి, తాతా శ్రీనివాస్, ఎన్‌టీటీ సుందరం, మేడపాటి చెల్లారెడ్డి, పాబోలు గోపాలం, యజ్జల రాంబాబు, కేశన అశోక్, చామన సూర్యచంద్రరావు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయం సిబ్బంది, ఏఎస్‌ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్ : 33వ వార్డులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వార్డు ఇన్‌చార్జి తాళ్ళూరి మురళీకృష్ణ



పెంటపాడు: రాచర్ల గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి హైమావతి



తాడేపల్లిగూడెం రూరల్: జగ్గన్నపేటలో ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్, ఏఎంసీ చైర్మన్ సంపత్

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

పెంటపాడు: పేదల సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమని ఎంపీపీ దాసరి హైమావతి అన్నారు. మండలంలోని రాచర్ల గ్రామ సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం సర్పంచ్ వాకా వెంకట దుర్గాభవాని ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం స్థానిక సచివాలయం వద్ద నిర్వహించారు. పార్టీ గౌరవాధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ హైమావతి, పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి అంటేనే గిట్టని ప్రతిపక్ష నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు జగనన్నపై అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలను కన్నబిడ్డల్లా భావించిన జగనన్న నాలుగున్నరేళ్లలో ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలు జగనన్నే తమకు కావాలంటూ సమ్మతిని తెలుపుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, సచివాలయాల కన్వీనర్ మైలవరపు పెదబాబు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, విప్పర్రు, రావిపాడు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పసల గంగా రామచంద్రన్(చంటి), ములగాల రామ సత్యనారాయణ(బాబ్జి), నంగిరెడ్డి రామకృష్ణ, గోకా వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ ప్రసాద్, శివారెడ్డి, గృహసారథులు, వలంటీర్లు, గ్రామ కార్యదర్శి బాబు, సచివాలయ సిబ్బంది గోవర్ధన్, మనీషా పాల్గొన్నారు.

మంచి నాయకత్వాన్ని ప్రజలు బలపర్చాలి

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణ వంటి మంచి నాయకత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ప్రజలు బలపర్చాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయం వద్ద వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామానికి చేకూరిన లబ్ధి బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏఎంసీ చైర్మన్ సంపత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే జగన్ నాయకత్వం అవసరమన్నారు. అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ప్రజల్ని కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువ నాయకుడు కొట్టు విశాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రూ.1.62 కోట్ల కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా మేలు చేసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అటువంటి జగన్ నాయకత్వం రాబోయే రోజుల్లో ఎంతైనా అవసరమన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సర్పంచ్ ములకాల సూర్యారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, డైరెక్టర్ పత్స అంజిబాబు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

అత్తిలి: అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తూ, అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ధిని చేకూర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. అత్తిలి మండలం పాలూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ తానుకొండ దయామణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పైబోయిన సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ జెండాను, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి బ్రోచర్‌లను అందజేశారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ తానుకొండ దయామణి, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఉప సర్పంచ్ రాపేటి సింహాచలం, మద్దాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు శరకడం రామలింగవిష్ణుమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పోలినాటి చంద్రరావు, రంభ సూరిబాబు, తానుకొండ దావీదు, ఎంపీడీవో ఎండీ అమీలుజమా, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండీ అబిబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: పాలూరులో వై ఏపీ నీడ్స్ జగన్ బ్రోచర్‌లను అందజేస్తున్న నాయకులు

తణుకు పట్టణంలో..

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు ఇచ్చిన అత్యధిక ప్రాధాన్యతతోనే పేదింటి పిల్లలు ఖరీదైన విద్యను అభ్యసిస్తున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ జేసీఎస్ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన ఆయన స్ఫూర్తితో తణుకు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలన్నిటిని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తున్నాయని అన్నారు. ముందుగా సచివాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సంక్షేమ పట్టికను, పార్టీ జెండా స్థూపాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి కార్యక్రమ బ్రోచర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, పైబోయిన ఏసుబాబు, జాకబ్‌బాబు, యారమాటి రామకృష్ణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు మండలంలో..

తణుకు టౌన్: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి కావాలని వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు చెప్పారు. మంగళవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని 3వ సచివాలయం వద్ద నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రుద్ర ధనరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కార్పొరేట్ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి కావాలని చెప్పారు. గత నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ కరిబండి రాజేష్, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీలు చంద్రు శ్యామల, విజయ దుర్గ, ఏఎంసీ డైరెక్టర్ బండి పార్వతి పాల్గొన్నారు.



తణుకు అర్బన్: హౌసింగ్ బోర్డు కాలనీలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



తణుకు టౌన్: వేల్పూరులోని 3వ సచివాలయం వద్ద మాట్లాడుతున్న బోడపాటి వీర్రాజు



ఇరగవరం: తూర్పు విప్పర్రులో సంక్షేమ పథకాల బ్రోచర్స్ చూపిస్తున్న నాయకులు

తూర్పువిప్పర్రులో..

ఇరగవరం: మండలంలోని తూర్పువిప్పర్రు సచివాలయ పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పంచాయితీలో సంక్షేమ పథకాల బోర్డులను వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పాలనలో తూర్పువిప్పర్రులో రూ.7 కోట్ల, 85 లక్షల 7వేల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు సైపురెడ్డి పెద్దిరాజు, శిరగం శ్రీనివాసు, గంజి సతీష్, మామిడిశెట్టి శ్రీనివాస్, ఆకేటి సత్యం, కుడిపూడి సూర్యనారాయణ, ఆకుల రామా సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

తణుకు అర్బన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, డిబేటింగ్ పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు సత్తాచాటినట్లు హెచ్‌ఎం కె.పద్మావతి తెలిపారు. పురుషుల, మహిళా గ్రంథాలయాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి ప్రశంసాపత్రాలు, బహుమతులు సాధించినట్లు వివరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతపల్లి దుర్గాప్రసాద్, కేశవ, విద్యాకమిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అత్తిలిలో..

అత్తిలి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమ్మర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంతెన వెంకట్రామరాజు చేతులు మీదుగా బహుమతులు అందజేసారు. మంతెన సత్యనారాయణరాజు జ్ఞాపకార్థం వారి సోదరులు పుల్లంరాజు, రామరాజులు డిపాజిట్ చేసినవడ్డీతో ప్రతీ ఏడాది విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నామని పాఠశాల హెచ్‌ఎం ఎస్ ధనసూకరాజు తెలిపారు.



తణుకు ఎంఈఓ హైమావతి చేతులమీదుగా బహుమతి తీసుకుంటున్న విద్యార్థిని

పారిశుధ్య కార్మికుల సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్‌లో దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు అఖిల భారత మునిసిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ళ సుబ్బారాయుడు వెల్లడించారు. స్థానిక మునిసిపల్ అండ్ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం కపర్దీ భవనంలో జరిగింది. యూనియన్ అధ్యక్షుడు ఏడిద నాని అధ్యక్షత వహించగా సుబ్బారాయుడు మాట్లాడారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు సహకరించాలి

తణుకు టౌన్: కళాశాలల్లో చదివే 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా కళాశాలల యాజమాన్యాలు సహకరించాలని తణుకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ కోరారు. మంగళవారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో స్పెషల్ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ అండ్ అవేర్‌నెస్ ప్రోగ్రాంలో (స్వీప్)బాగంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి కళాశాలలో చదివే విద్యార్థులకు ఓటు హక్కు కల్పించేలా ఓటు నమోదు పత్రాలు అందజేయాలని కోరారు. బుధవారం తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల, ఎస్‌ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23దీన ఇరగవరం యర్రాయి చెరువు గ్రామం నుంచి తణుకులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24న తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహనా కార్యక్రమం, 25న భారీ అవగాహనా ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.



కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి బీవీ రమణ

కులగణన సర్వేలో ఉద్యోగులే కీలకం

అత్తిలి: సమగ్ర కుల గణన ప్రక్రియ ద్వారా సమగ్ర సమాచార సేకరణ చేపట్టి ఆయా వర్గాల ప్రజలకు మరింత మెరుగైన పరిపాలన అందించే కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల కీలకమైన విధులను నిర్వర్తించాలని కులగణన రిసోర్స్‌పర్సన్, గణపవరం ఎంపీడీఓ జ్యోతిర్మయి అన్నారు. మంగళవారం అత్తిలి షాదీఖానా భవనంలో కులగణన సర్వేపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ కులగణనలో భాగంగా కుటుంబ సభ్యుల ప్రాతమిక సమాచారంలో జిల్లా, మండల, గ్రామం వివరాలు, గృహ ద్వితీయ వివరాలతో కుటుంబ పెద్ద, ఇంటి చిరునామా, గృహ వివరాలు, ఎంతమంది తదితర అంశాలను, కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షులు రంభ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అనిశెట్టి త్రిమూర్తులు, ఆనాల ఆదినారాయణ, వర్రి శ్రీనివాస్, పూతినీడి శ్రీనివాస్, ఎంపీడీఓ ఎండీ అమీలుజమా తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: సమగ్ర కులగణనపై శిక్షణ ఇస్తున్న అధికారులు

కులగణనపై అవగాహన

ఇరగవరం: మండలంలోని ఇరగవరం మహిళ సమైక్య ద్వాక్రా భవనంలో మంగళవారం కులగణన పై నాయకులకు అధికారులు అవగాహన కల్పించారు. తణుకు తహసీల్దార్, ఇరగవరం ఎంపీడీఓలు ప్రసాద్, ఎ.శ్రీనివాసు మాట్లాడుతూ కులగణన సర్వేలో అందరు వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లిసర్వే నిర్వహించాలి అన్నారు. ప్రతి ఇంటి సర్వే ముగింపులో వాలంటీర్, సచివాలయ ఉద్యోగి ఈకేవైసీ తప్పని సరిగా వేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చోడే జోషి, జేసీఎస్ కన్వీనర్ దినేష్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తణుకులో..

తణుకు టౌన్: రాష్ట్రంలో ఈ నెల 27 నుంచి చేపట్టే కుల గణనను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ కోరారు. మంగళవారం తణుకు ఎంపీడీవో కార్యాలయంలో కుల గణనన సర్వేపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ సర్వేను విజయవంతం చేయాలనికోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్ల పూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్ర ధనరాజు, ఎంపీడీఓ కే కిరణ్‌కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, దువ్వ సర్పంచ్ అడ్డా బాబు, ఈఓపీఆర్డీ ఏఎస్‌ఆర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల సమాచారాన్ని నమోదు చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: కుల గణనలో ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని మాత్రమే నమోదు చేయా లని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ సూచించారు. మంగళవారం మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్‌ఎన్ కాలనీ కర్రి రామచంద్రరావు కన్వెన్షన్ హాలులో కుల గణనపై మండలంలోని సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి వారం రోజుల పాటు కుల గణన ఉంటుందన్నారు. సామరస్యంగా కుల గణన చేయాలని. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది విధిగా వలంటీర్‌ను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. ముందుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ మాట్లాడుతూ కుల పెద్దలు, నాయకుల సహకారం తీసుకోవాలన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం జీవీకేడీఎం లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ అధికారి రామాంజనేయ రాజు, ఆర్ అండ్ బీ ఏఈ బి.రవిబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, దేవి మాట్లాడారు. మాస్టర్ ట్రైనీ రవిచంద్ర శిక్షణనిచ్చారు.

కుల గణనకు సహకరించాలి

పెంటపాడు: కుల గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పలు కుల సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ కుల గణన ప్రక్రియ అనేది కేవలం సమాచారం కోసమే అని, ఎప్పటిలానే మండల అధికారుల ద్వారా ధృవ పత్రాల జారీ కొనసాగుతుందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. జిల్లా ఎస్టీ, ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ 1931లో బ్రిటీష్ హయాంలో తొలిసారి కుల గణన జరిగిందన్నారు. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ సమన్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో ఈ సర్వే చేయిస్తున్నారన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, బీసీ సంఘ నాయకుడు కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుల గణనకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సమన్యాయం చేసేందుకు నామినేటెడ్ పదవుల్లో వారికి పెద్దపీట వేశారన్నారు. ఈవోపీఆర్డీ ఎస్‌ఎన్‌వీ ప్రసాద్, ఎంఈవో టీవీ రామకృష్ణ, ఆర్‌ఐ కనకదుర్గ, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తాడేపల్లి ప్రేమ్‌కుమార్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, నంగిరెడ్డి రామకృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యురాలు షేక్ మస్తాన్‌బీ, వైఎస్సార్ సీపీ నాయకులు, పలు కుల సంఘాల ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిలబస్‌పై దృష్టి సారించాలి

పెంటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో సిలబస్‌పై హెచ్‌ఎంలు దృష్టి సారించాలని మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం విద్యాశాఖ సమీక్షలో భాగంగా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ సూచించిన పలు అంశాలు, వాటి అమలు తీరుపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ప్రధానంగా సిలబస్, రెండో విడత పాఠ్య పుస్తకాలు, బైజూస్ ట్యాబ్‌ల నిర్వహణ, స్మార్ట్‌టీవీల వినియోగం, ఫలితాలు, నాడు- నేడులో అమర్చిన పలు పరికరాల పనితీరు, సైన్స్ ఎగ్జిబిషన్‌లు తదితర విషయాలపై పాఠశాలల వారీగా సమీక్షించారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లు, పాఠశాల సమీప ప్రాంతాల్లోని దుకాణాల్లో మత్తు పదార్థాల అమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలని, యాప్‌ల నిర్వహణ సమర్థవతంగా నిర్వహించడంతో పాటు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, జగన్న విద్యాకానుక, గోరుముద్ద, అమ్మఒడి తదితర విషయాలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు చిట్టిమ్మ, రాజు, బాలు, సాయిరాం పాల్గొన్నారు.